సాక్షి ఖమ్మం

శనివారం । 11 । అక్టోబర్ । 2025



క్రీడలతో ఉజ్వల భవిష్యత్

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ సొంతమవుతుందని ఖమ్మం ఎంపీ రఘురాంరెడ్డి తెలిపారు. 8లో



పది రోజుల్లో కొనుగోళ్లు

సీసీఐ నిబంధనల సడలింపుతో జిన్నింగ్ మిల్లుల యాజమాన్యాలు టెండర్ల దాఖలు చేయగా పత్తి కొనుగోళ్లకు రంగం సిద్ధమైంది. 8లో

గరిష్టం / కనిష్టం 31° / 22°

వాతావరణం

జిల్లాలో శనివారం సాధారణ ఉష్ణోగ్రతలే నమోదవుతాయి. కొన్నిచోట్ల వాతావరణం చల్లబడి వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

నేడు మంత్రి పొంగులేటి పర్యటన

ఖమ్మంమయూరిసెంటర్/నేలకొండపల్లి: రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శనివారం జిల్లాలో పర్యటించనున్నారు. శనివారం ఉదయం నేలకొండపల్లి మండలం ముజ్జుగూడెం, పైనంపల్లిల్లో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారు. అలాగే, సాయంత్రం 4గంటలకు తిరుమలాయపాలెం మండలం పాతర్లపాడు, జోగులపాడు, జల్లేపల్లి, హైదర్‌సాయిపేటలోల్లో బీటీ, సీసీ రోడ్ల నిర్మానానికి మంత్రి శంకుస్థాపన చేయనున్నారు.

డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కాలేజీలో డిప్లొమా ఇన్ అనస్తీషియా టెక్నీషియన్, డిప్లొమా ఇన్ మెడికల్ ఇమేజింగ్ టెక్నీషియన్ కోర్సుల్లో ప్రవేశాలు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ టి.శంకర్ తెలిపారు. రెండేళ్ల కాలపరిమితి కలిగిన ఈ కోర్సుల్లో 30చొప్పున సీట్లు ఉన్నాయని పేర్కొన్నారు. ఇంటర్ బైపీసీ చేసిన విద్యార్థులకు ప్రాధాన్యత ఉంటుందని, ఎంపీసీ, ఇతర కోర్సులు చేసిన వారిని తర్వాత పరిగణనలోకి తీసుకుంటామని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ఈనెల 28వ తేదీలోగా https//tgpmb.telangana.gov.in ద్వారా దరఖాస్తు చేసుకుని, ప్రింట్ కాపీ, ధ్రువ పత్రాలతో కాలేజీలో సమర్పించాలని సూచించారు. పూర్తి వివరాల కోసం https//gmckhammam.org వెబ్‌సైట్‌లో పరిశీలించాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మంమయూరిసెంటర్: మైనార్టీ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను ఔట్ సోర్సింగ్ విధానంలో భర్తీ చేయనున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి ఎం.డీ.ముజాహిద్ తెలిపారు. జేఎల్ పోస్టులకు సంబంధిత సబ్జెక్టులో పీజీ 50 శాతం మార్కులతో పాటు బీఈడీలో 50 శాతం మార్కులు, టీజీటీ పోస్టులకు సబ్జెక్టులో గ్రాడ్యుయేషన్, బీఈడీలో 50 శాతం మార్కులు, టెట్ తప్పనిసరి ఉండాలని చెప్పారు. మూడేళ్ల బోధన అనుభవం కలిగి జిల్లాకు చెందిన అభ్యర్థులు పూర్తి బయోడేటా, విద్యార్హతల సర్టిఫికెట్లు, జిరాక్స్‌లు, ఇతర పత్రాలతో సంబంధిత గురుకులాల్లో ఈనెల 13నుంచి 15వ తేదీ సాయంత్రం వరకు సమర్పించాలని సూచించారు. ప్రతిభ ఆధారంగా షార్ట్ లిస్ట్ రూపొందించాక ఇంటర్వ్యూల ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తామని తెలిపారు. సత్తుపల్లి(బాలుర), నేలకొండపల్లి, ఖమ్మం బాలికల జూనియర్ కళాశాల, వైరా(బాలికలు)లో వివిధ సబ్జెక్టులు, ఫిజికల్ డైరెక్టర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని వెల్లడించారు.

డబ్లింగ్ లైన్ పనుల పరిశీలన



డీఆర్‌ఎంకు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

కారేపల్లి: కారేపల్లి రైల్వేస్టేషన్ మీదుగా నిర్మిస్తున్న డబ్లింగ్ లైన్ పనులను దక్షిణ మధ్య రైల్వే డీఆర్‌ఎం గోపాలకృష్ణ శుక్రవారం పరిశీలించారు. డోర్నకల్ రైల్వే జంక్షన్‌నుంచి కారేపల్లి మీదుగా కొత్తగూడెం(భద్రాచలం రోడ్డు) వరకు నిర్మించే లైన్ పనుల పురోగతిపై అధికారులతో చర్చించారు. కాగా, లైన్ నిర్మాణంలో భూములు కోల్పోతున్న వారు పరిహారం చెల్లించాలని కోరగా డీఆర్‌ఎం సానుకూలంగా స్పందించారు. అనంతరం కారేపల్లి గ్రామస్తులు డీఆర్‌ఎంను కలిసి కరోనా సమయాన రద్దు చేసిన డోర్నకల్–భద్రాచలం రోడ్, మణుగూరు–కాజీపేట జంక్షన్ ప్యాసింజర్ రైళ్లను పునరుద్ధరించాలని కోరారు. అంతేకాక డోర్నకల్ నుంచి కొత్తగూడెం వరకు వెళ్లే అన్ని రైళ్లకు కారేపల్లిలో హాల్టింగ్ కల్పించాలని వినతిపత్రం ఇచ్చారు. గ్రామస్తులు సురేందర్ రెడ్డి, సురేందర్ మణియార్, తురక నారాయణ, అజ్మీర బిచ్చానాయక్, తొగర శ్రీను తదితరులు పాల్గొన్నారు.

13, 14న ఇంటర్వ్యూలు



ఖమ్మం సహకారనగర్: ప్రీ ప్రైమరీ తరగతుల బోధనకు ఎంపికచేసిన ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ఇన్‌స్ట్రక్టర్లు, ఆయా పోస్టుల భర్తీకి ఈనెల 13, 14వ తేదీల్లో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఖమ్మం ఆర్డీఓ జి.నర్సింహారావు తెలిపారు. ఆర్డీఓ కార్యాలయంలో ఈ నెల 13న మధ్యాహ్నం 2గంటల నుంచి, 14వ తేదీన ఉదయం 10గంటల నుంచి ఇంటర్వ్యూ లు ఉంటాయని వెల్లడించారు. గత నెల 27న మిగిలిపోయిన, హాజరుకాని అభ్యర్థులకు ఇప్పుడు ఇంటర్వ్యూ నిర్వహిస్తామని తెలిపారు.

సొంత డివిజనే లేదు!

ఖమ్మం రెవెన్యూ డివిజన్ రాష్ట్రంలోనే అతిపెద్దదిగా నిలుస్తోంది. జిల్లాల విభజన సమయాన కల్లూరు డివిజన్‌ను ఏర్పాటు చేసినా, ఖమ్మం డివిజన్‌లో మాత్రం మండలాల సంఖ్య ఇంకా ఎక్కువగానే ఉంది. 15 మండలాలు, 276 రెవెన్యూ గ్రామాలతో కూడిన ఈ డివిజన్ కేంద్రానికి మధిర, ఎర్రుపాలెం మండలాలు దూరంగా ఉండడంతో రెవెన్యూ పాలన అధికారులకు తలకు మించిన భారంలా మారింది. అంతేకాకుండా భూసమస్యలపై విన్నవించుకునేందుకు ప్రజలు రావాలంటే దూరాభారమవుతోంది. దీంతో కల్లూరు మాదిరిగానే మధిర నియోజకవర్గాన్ని డివిజన్ చేస్తే అటు పాలనాపరంగా ఇటు ప్రజలకు సౌకర్యంగా ఉంటుంది. రాష్ట్రంలో అతి తక్కువ మండలాలతోనూ పలుచోట్ల డివిజన్లు ఏర్పాటైన విషయాన్ని స్థానికులు ప్రస్తావిస్తున్నారు. – సాక్షిప్రతినిధి, ఖమ్మం

మధిర వాసుల ఆవేదన

- 15 మండలాలతో రాష్ట్రంలోనే పెద్దవిగా ఖమ్మం, కొత్తగూడెం
- మధిర డివిజన్ ఏర్పాటైతే అందరికీ సౌలభ్యం
- ఐదు మండలాలతో ఏర్పాటుకు అన్ని సానుకూలతలు



మధిర నియోజకవర్గ కేంద్రం వ్యూ

276 రెవెన్యూ గ్రామాలు

ఖమ్మం రెవెన్యూ డివిజన్‌లో సింగరేణి, కామేపల్లి, రఘునాథపాలెం, ఖమ్మంరూరల్, తిరుమలాయపాలెం, కూసుమంచి, నేలకొండపల్లి, ముదిగొండ, చింతకాని, ఖమ్మం అర్బన్, కొణిజర్ల, వైరా, బోనకల్, మధిర, ఎర్రుపాలెం మండలాలు ఉన్నాయి. ఈ డివిజన్ పరిధిలో 276 రెవెన్యూ గ్రామాలు, 416 గ్రామపంచాయతీలు ఉండగా, డివిజన్ విస్తీర్ణం 2,939 చదరపు కిలోమీటర్లుగా ఉంది. ఖమ్మం, పాలేరు, మధిర, వైరా నియోజకవర్గాల(ఏన్కూరు మినహా)తో కొనసాగుతున్న ఈ డివిజన్ వ్యాప్తంగా పర్యవేక్షణ ఖమ్మం కేంద్రంగా నిర్వహించడం యంత్రాంగానికి భారంలా మారింది. ప్రజల నుంచి అందే వినతుల పరిశీలన ఉద్యోగులకు ఇబ్బందిగా ఉంటోంది.

అతి తక్కువ మండలాలతో..

దూరాభారం, పాలనా సౌలభ్యం కోసం రాష్ట్రంలో కొత్త రెవెన్యూ డివిజన్లు ఏర్పాటయ్యాయి. అందులో అతి తక్కువ మండలాలతోనూ కొన్ని ఏర్పడ్డాయి. ఉట్నూరు డివిజన్ నాలుగు మండలాలతో, మెట్‌పల్లిలో మూడు మండలాలు, కోరుట్ల డివిజన్‌లో నాలుగు, తూప్రాన్‌లో ఐదు మండలాలు, పరకాల ఐదు మండలాలు, ఎల్లారెడ్డి నాలుగు మండలాలతో ఉన్నాయి. వీటితో పోలిస్తే ఐదు మండలాలతో కూడిన మధిర నియోజకవర్గాన్ని రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటుచేస్తే ప్రజల ఇక్కట్లు తీరతాయి. రాష్ట్రంలో అతి పెద్ద రెవెన్యూ డివిజన్లుగా ఖమ్మం, కొత్తగూడెం 15మండలాలతో ఉన్నాయి. వీటి తర్వాత ఆదిలాబాద్, వనపర్తి, సూర్యాపేట రెవెన్యూ డివిజన్లలో 14 చొప్పున మండలాలను చేర్చారు.

50 కిలోమీటర్లకు పైగానే..

ఖమ్మం నుంచి మధిరకు 55 కి.మీ., ఎర్రుపాలెం 70 కి.మీ. దూరంలో ఉంటుంది. మధిర నియోజకవర్గ పరిధిలో మధిర, ఎర్రుపాలెం, ముదిగొండ, చింతకాని, బోనకల్ మండలాలకు గాను మధిర, ఎర్రుపాలెం డివిజన్ కేంద్రానికి దూరంగా ఉన్నాయి. అక్కడ తహసీల్దార్ కార్యాలయాల్లో పరిష్కారం కాని సమస్యల కోసం ప్రజలు ఖమ్మం ఆర్డీఓ కార్యాలయంతో పాటు కలెక్టరేట్‌కు వస్తున్నారు. ఈ ఐదు మండలాలతో మధిరలో డివిజన్ ఏర్పాటు చేస్తే అక్కడే సమస్యల పరిష్కారానికి అవకాశం ఏర్పడుతుంది. అలాగే, పాలన కూడా అధికారులకు సులభతరమవుతుంది.

సబ్ కలెక్టర్ స్థాయికి కల్లూరు

2016 అక్టోబర్ 11న కల్లూరు డివిజన్ ఏర్పాటైంది. ఈ డివిజన్‌లో కల్లూరు, పెనుబల్లి, సత్తుపల్లి, వేంసూరు, తల్లాడ, ఏన్కూరు మండలాలను చేర్చారు. మొత్తం 128 రెవెన్యూ గ్రామాలకు గాను 3,29,882 మంది జనాభా ఉన్నారు. ఈ ఏడాది జూలై 18న కల్లూరు డివిజన్ సబ్ కలెక్టర్ కార్యాలయంగానూ అప్‌గ్రేడ్ కావడంతో ఐఏఎస్ అధికారి అజయ్‌యాదవ్ విధులు నిర్వర్తిస్తున్నారు. కల్లూరు డివిజన్ పరిధిలోని ఆరు మండలాలు గతంలో ఖమ్మం డివిజన్ పరిధిలోనే కొనసాగాయి. ప్రస్తుతం కల్లూరు డివిజన్ ఏర్పాటుతో అక్కడికక్కడే సమస్యలు పరిష్కరిస్తుండగా ఖమ్మంకు వచ్చే ఫిర్యాదులు తగ్గాయి. ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకుని మధిర కేంద్రంగా డివిజన్ ఏర్పాటు చేయాలనే వినతులు వెల్లువెత్తుతున్నాయి.

ఖమ్మం డివిజన్ పరిధిలో కుటుంబాలు, జనాభా (2011 లెక్కల ప్రకారం)

కుటుంబాలు	2,94,015
ఎస్సీ జనాభా	2,04,074
ఎస్టీ జనాభా	1,53,523
ఇతర జనాభా	7,14,160
మొత్తం	10,71,757
మండలాలు	15
రెవెన్యూ గ్రామాలు	276
గ్రామపంచాయతీలు	416
విస్తీర్ణం	2,939 చ.కి.మీ.

మధిర నియోజకవర్గం పరిధిలో..

మండలం	జనాభా	రెవెన్యూ గ్రామాలు
మధిర	68,548	25
ఎర్రుపాలెం	49,851	24
బోనకల్	43,909	18
చింతకాని	48,909	16
ముదిగొండ	58,485	23
మొత్తం	2,69,702	106

భద్రాద్రి అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

- ఖమ్మంలో టీటీడీ ఆలయానికి 13న స్థల పరిశీలన
- దేవాదాయ శాఖ అధికారులతో మంత్రి తుమ్మల సమీక్ష



మాట్లాడుతున్న మంత్రి తుమ్మల, పక్కన దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్

సాక్షిప్రతినిధి, ఖమ్మం: దేశంలోనే ప్రత్యేకత సంతరించుకున్న భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. హైదరాబాద్‌లోని సచివాలయంలో దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, అధికారులతో శుక్రవారం ఆయన ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ భద్రాచలం ఆలయ విస్తరణ కోసం భూసేకరణ పూర్తయిందన్నారు. మాడవీధుల విస్తరణ, ప్రాకార గోడల నిర్మాణాలు తక్షణమే ప్రారంభించాలని ఆదేశించారు. ఆగమశాస్త్ర ప్రమాణాలకు అనుగుణంగా ఆర్కిటెక్ట్ రూపొందించిన డిజైన్లను ఖరారు చేసి పనులు వేగవంతం చేయాలన్నారు. భక్తులకు వసతి, రవాణా, పార్కింగ్, నీటి సదుపాయాలు కల్పించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని మంత్రి తుమ్మల సూచించారు. భద్రాద్రి రామాలయం దేశవ్యాప్తంగా భక్తులను ఆకర్షించేలా అధికారులు నిరంతరం పనులను పర్యవేక్షించాలని అన్నారు.

టీటీడీ ఆధ్వర్యాన ఆలయ నిర్మాణం

తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) ఆధ్వర్యాన ఖమ్మం నగరంలో వేంకటేశ్వర స్వామి ఆలయం నిర్మించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని మంత్రి తుమ్మల తెలిపారు. ఇందుకోసం మూడు ప్రాంతాలను కలెక్టర్ టీటీడీ అధికారులకు ప్రతిపాదించినట్లు చెప్పారు. ఈ మేరకు వచ్చే సోమవారం టీటీడీ అధికారులు ఖమ్మంలో పరిశీలించి ఆలయ స్థలాన్ని ఖరారు చేస్తారని మంత్రి వెల్లడించారు.

ఏసీపీ పోస్టు.. వెరీ హాట్!

- వైరా ఏసీపీ పోస్టుపై పలువురి దృష్టి
- పోటీలో ప్రధానంగా ముగ్గురు అధికారులు
- పది రోజుల క్రితం రిటైర్డ్ అయిన రెహమాన్



వైరా ఏసీపీ కార్యాలయం

వైరా: వైరా అసిస్టెంట్ పోలీసు కమిషనర్ పోస్టుకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. ఈ కార్యాలయ పరిధిలో ఎనిమిది పోలీస్‌స్టేషన్లు ఉండగా, గతంలో ఏసీపీగా విధులు నిర్వర్తించిన రెహమాన్ గత నెల 30న ఉద్యోగ విరమణ చేశారు. పది రోజులు దాటినా కొత్త అధికారిని నియమించకపోగా తాత్కాలికంగా కల్లూరు ఏసీపీ రఘుకు బాధ్యతలు అప్పగించారు. కానీ సత్తుపల్లి బాధ్యతలు చూస్తూనే మూడు నియోజకవర్గాల పరిధితో కూడిన వైరా ఏసీపీ బాధ్యతలు నిర్వర్తించడం కష్టమవుతున్నట్లు సమాచారం. అంతేకాక కేసుల విచారణలో కూడా జాప్యం జరుగుతోంది. ఈనేపథ్యాన ఏసీపీగా వచ్చేందుకు ముగ్గురు అధికారులు తమ వంతు ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. ఇందులో ఒకరికి అధికార పార్టీ నాయకుల ఆశీస్సులు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.

ఐదు నెలల క్రితమే బదిలీ!

వైరా ఏసీపీగా కొనసాగిన రెహమాన్ స్థానంలో హైదరాబాద్ పోలీస్ శిక్షణ కేంద్రంలో విధులు నిర్వర్తిస్తున్న ఎస్.సారంగపాణిని నియమిస్తూ మే 7వ తేదీన ఉత్తర్వులు విడుదలయ్యాయి. కానీ తనకు అతి తక్కువ పదవీకాలం ఉన్నందున ఇక్కడే కొనసాగించాలని రెహమాన్ ఉన్నతాధికారులకు విన్నవించడంతో ఆ బదిలీని రద్దు చేశారు. దీంతో మూడేళ్ల మూడు నెలల పదవీ కాలం అనంతరం ఆయన గత నెల 30న రిటైర్డ్ అయ్యారు.

పోటీలో పలువురు

వైరా ఏసీపీ పరిధిలో వైరా, కొణిజర్ల, తల్లాడ, చింతకాని, బోనకల్, మధిరటౌన్, రూరల్, ఎర్రుపాలెం పోలీస్ స్టేషన్లు ఉన్నాయి. వీటి పరిధిలో నిత్యం ఐదు నుంచి పదిహేనుకు పైగా కేసులు నమోదవుతుండగా.. కొన్ని కేసులను ఏసీపీ స్థాయి అధికారే విచారించాల్సి ఉంటుంది. కానీ పది రోజులుగా పోస్టు ఖాళీగా ఉండడంతో సర్కిల్ ఇన్‌స్పెక్టర్లపై భారం పడుతోంది. ఈ మేరకు కాంగ్రెస్ నాయకులు కొందరు భద్రాద్రి జిల్లాలో లూప్‌లైన్‌లో ఉన్న ఓ అధికారిని ఏసీపీగా తీసుకొచ్చేందుకు గట్టి ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. ఇదే సమయాన ఓ ఐపీఎస్ అధికారి, వరంగల్ జిల్లాలో పనిచేస్తున్న మరో ఏసీపీ కూడా ఈ పోస్టుపై దృష్టి సారించినట్లు తెలిసింది. అయితే, అధికార పార్టీ నాయకులు సూచించిన అధికారికే పోస్టింగ్ దక్కుతుందనే చర్చ జరుగుతోంది. ఏదిఏమైనా ఉన్నతాధికారులు స్పందించి ఏసీపీ పోస్టును త్వరగా భర్తీ చేస్తేనే కేసుల విచారణ, శాంతిభద్రతల పరిరక్షణ సులువవుతుందనే భావన వ్యక్తమవుతోంది.

ఊరు డోర్నకల్... పేరు ఖమ్మం

- సంద్ర కలప అక్రమ రవాణాలో ఆనవాళ్లను గుర్తించిన అటవీ శాఖ
- మరింత లోతుగా విజిలెన్స్ విచారణ



నరికిన చోట సంద్ర చెట్టు ఆనవాళ్లు

ఖమ్మంవ్యవసాయం: తప్పుడు ధృవ పత్రాలతో సాధారణ కలప మాటున విలువైన సంద్ర కలపను రవాణా చేసిన వ్యవహారంలో రాష్ట్ర స్థాయి అటవీ అధికారుల విచారణలో కీలక అంశాలు వెలుగు చూస్తున్నాయి. నేషనల్ ట్రాన్సిట్ పర్మిట్లతో ఖమ్మం జిల్లా చింతకాని అటవీ సెక్షన్ నుంచి తుమ్మ కలప సేకరించామని చెబుతూ ఉత్తరాది రాష్ట్రాలకు సంద్ర కలపను తరలించిన విషయం ఇటీవల బయపడింది. ఈ విషయమై ఖమ్మం డీఎఫ్‌ఓ సిద్దార్థ్ విక్రమ్‌సింగ్ ఇచ్చిన నివేదిక ఆధారంగా రాష్ట్ర విజిలెన్స్, టాస్క్‌ఫోర్స్ బృందాలు లోతుగా విచారణ చేపడుతున్నాయి. ఇప్పటికే ఇద్దరు ఉద్యోగులను సస్పెండ్ చేయగా, సంద్ర కలప ఎక్కడి నుంచి సేకరించారనే విషయమై ఆరాతీశారు. ఈనేపథ్యాన మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ అటవీ సెక్షన్ పరిధి తోడేళ్లగూడెం, మన్నెగూడెం రెవెన్యూ గ్రామాల్లోని అసైన్డ్ భూముల్లో సంద్ర వృక్షాలను నరికినట్లు గుర్తించారు. నాలుగు నెలల్లో 24 పర్మిట్ల ద్వారా వందలాది క్యూబిక్ మెట్రిక్ టన్నుల సంద్ర కలపను అక్రమంగా ఉత్తరాది రాష్ట్రాల్లోని పాన్ మసాలా కంపెనీలకు తరలించినట్లు తేల్చారు. సంద్ర కలపను డోర్నకల్ సెక్షన్ నుంచి తరలించినట్లు తేలడంతో విధుల్లో విఫలమైనట్లు భావించి అక్కడి ఉద్యోగులపై వేటు వేసే అవకాశముందని సమాచారం.

కాంగ్రెస్ అధ్యక్ష పదవులకు నేడు దరఖాస్తుల స్వీకరణ

ఖమ్మంమయూరిసెంటర్: జిల్లా, నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్ష పదవులకు ఆసక్తి ఉన్న నాయకుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా, నగర అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మహ్మద్ జావేద్ పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న నాయకులు దరఖాస్తుకు బయోడేటా జత పరిచి శనివారం ఉదయం 10గంటల నుంచి ఖమ్మంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. మధ్యాహ్నం ఒంటి గంట నుండి సాయంత్రం 7గంటల వరకు ఏఐసీసీ పరిశీలకులు అందుబాటులో ఉంటారని, వారి పరిశీలన అనంతరం అధ్యక్షుల ఎంపిక ఉంటుందని దుర్గాప్రసాద్, జావేద్ తెలిపారు.

లోక్ కళ్యాణ్ మేళాలో రుణాలు

ఖమ్మంమయూరిసెంటర్: వీధి వ్యాపారులు తమ వ్యాపారాలను వృద్ధి చేసుకునేలా ప్రభుత్వం లోక్ కళ్యాణ్ మేళా ద్వారా రుణాల మంజూరుకు తిరిగి ప్రారంభించిందని మెప్మా పీడీ నళిని పద్మావతి తెలిపారు. కేఎంసీ కార్యాలయంలో మెప్మా అధికారులు, బ్యాంకర్లతో శుక్రవారం సమావేశమైన ఆమె మున్సిపాలిటీల వారీగా లక్ష్యం మేర వ్యాపారులకు అవగాహన కల్పిస్తూ రుణాలు మంజూరు చేయించాలని సూచించారు. ఈ విషయంలో మెప్మా అధికారులకు బ్యాంకర్లు సహకరించాలని తెలిపారు. అలాగే, ఈ ఏడాది ఖమ్మంలో మూడు, కల్లూరులో రెండు, మధిర, వైరాల్లో ఒక్కో కేంద్రంలో మెప్మా ఆధ్వర్యాన ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉన్నందున మహిళా సమాఖ్య సభ్యులకు శిక్షణ ఇవ్వాలని సూచించారు. ఈ సమావేశంలో డీఎంసీ ఎస్.సుజాత, ఏఓ శ్రీకాంత్, టీఎంసీ జి.సుజాత, టీజీజీబీవీ ఆర్‌ఎం ప్రసన్నకుమార్, బ్యాంకర్లు, మెప్మా సీఓలు పాల్గొన్నారు.

రండీ.. టెండర్లు వేయండి

- మద్యం వ్యాపారులతో అధికారుల భేటీలు
- వ్యాపారం లాభసాటిగా ఉంటుందని భరోసా



ఖమ్మంక్రైం: 'వైన్ షాపులకు టెండర్లు వేయండి.. లక్కు కలిసొచ్చి షాప్ దక్కితే వ్యాపారంలో మంచి లాభాలు ఉంటాయి..' అంటూ మద్యం వ్యాపారులకు ఎక్సైజ్ అధికారులు భరోసా ఇస్తున్నారు! జిల్లాలో 116 వైన్స్‌కు గాను గతనెల 26వ తేదీ నుంచి దరఖాస్తులు స్వీకరిస్తుండగా ఇప్పటివరకు 72దరఖాస్తులే నమోదయ్యాయి. ఈనెల 18వ తేదీ వరకు గడువు ఉన్నప్పటికీ అధికారులు ముందు జాగ్రత్తగా మద్యం వ్యాపారంలో ఏళ్లుగా కొనసాగుతున్న వారితో సమావేశమవుతున్నట్లు తెలిసింది. దరఖాస్తుల పెంచడమే లక్ష్యంగా అధికారులు తమ వంతు ప్రయత్నాల్లో నిమగ్నమైనట్లు సమాచారం. గత ఎక్సైజ్ పాలసీలో 4వేలకు పైగా దరఖాస్తులు నమోదవడంతో రూ.144కోట్ల ఆదాయం వచ్చింది. ఈసారి అంత కంటే ఎక్కువ ఆదాయం సాధించాలనే లక్ష్యం నిర్దేశించుకున్నా సమయం తక్కువగా ఉండడం, ఇప్పటివరకు ఆశించిన స్థాయిలో దరఖాస్తులు రాకపోవడంతో అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. ఈమేరకు సర్కిళ్ల వారీగానే కాక జిల్లా స్థాయి అధికారులు సైతం వ్యాపారులతో సమావేశమవుతూ వైన్స్‌కు టెండర్లు వేయాలని, డ్రాలో షాపులు వస్తే మంచి లాభాలు ఉంటాయని భరోసా కల్పిస్తున్నట్లు సమాచారం. గురువారం రాత్రి కూడా ఖమ్మంలో పలువురు వ్యాపార ప్రముఖులతో సమావేశమైనట్లు తెలిసింది. ఈక్రమాన దరఖాస్తు ధరను రూ.3లక్షలకు పెంచడంపై కొందరు వ్యాపారులు పెదవి విరిచినట్లు సమాచారం.

వచ్చే వారంపైనే ఆశలు

జిల్లాలో 116 వైన్స్‌కు ఇప్పటివరకు 72 దరఖాస్తులు అందగా, ఎక్సైజ్ శాఖకు రూ.21.16 కోట్ల ఆదాయం సమకూరింది. నేడు, రేపు(శనివారం, ఆదివారం) వారాంతపు సెలవులు వచ్చాయి. ఆపై సోమవారం నుంచి వచ్చే శనివారం వరకే దరఖాస్తు చేసుకునే అవకాశముంది. ఈనేపథ్యాన వ్యాపారులు ముందుకొచ్చే అవకాశముందని అధికారులు భావిస్తున్నారు. అయినప్పటికీ తమ వంతు ప్రయత్నంగా జిల్లా వ్యాపారులతో పాటు గత పాలసీలో టెండర్లు వేసిన ఏపీ వ్యాపారులను సైతం సంప్రదిస్తున్నట్లు తెలిసింది. గత ఎక్సైజ్ పాలసీలో ఆదాయంలో రాష్ట్రంలోనే రెండో స్థానం సాధించిన జిల్లాను ఈసారి కూడా ముందు వరుసలో నిలపాలనే భావనతో ఎక్సైజ్ అధికారులు యత్నిస్తుండడం గమనార్హం.

మెరుగైన వైద్యం.. ప్రసవాలు

- ప్రభుత్వ ఆస్పత్రుల్లో సేవలపై ప్రత్యేక దృష్టి
- వైద్య, ఆరోగ్యశాఖపై సమీక్షలో కలెక్టర్ అనుదీప్



మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ అనుదీప్

ఖమ్మంవైద్యవిభాగం: ప్రభుత్వ ఆస్పత్రులపై నమ్మకంతో వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశించారు. కలెక్టరేట్‌లో వైద్య, ఆరోగ్యశాఖపై శుక్రవారం నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. పీహెచ్‌సీల్లో వైద్యులు, సిబ్బంది హాజరు ఆన్‌లైన్‌లోనే నమోదు చేయాలని తెలిపారు. ప్రసవ సమయాన తల్లి మరణాలకు సంబంధించి కేసులను పరిశీలిస్తే రెండో విడత పరీక్ష ప్రైవేట్ ఆస్పత్రుల్లో చేయించుకున్నట్లు తేలిందన్నారు. ఈ నేపథ్యాన ఏడాది కాలంగా ప్రతీ ఆశా కార్యకర్త పరిధిలో ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లిన కేసులపై ఆరా తీసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. ఇక నుంచి వైద్యాధికారులు తమ పరిధిలోని ఆశా కార్యకర్తలతో సమావేశమవుతూ గర్భిణులు ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవించేలా పర్యవేక్షించాలని, ఇందులో తప్పనిసరైతే తప్ప శస్త్రచికిత్సలు ఉండొద్దన్నారు. ఇక గర్భిణులకు చికిత్స అందించడంలో నిర్లక్ష్యం వహించే ప్రైవేట్ ఆస్పత్రులపైనా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు. అనంతరం పిల్లలకు వ్యాక్సినేషన్, ఎన్‌సీడీ సర్వే వివరాల ఆన్‌లైన్‌పై సూచనలు చేసిన కలెక్టర్... గత ఏడాది కంటే 58 శాతం డెంగీ కేసులు తగ్గడంపై అభినందించారు. ఇక టీబీ నిర్మూలన, తెలంగాణ డయాగ్నస్టిక్ హబ్ నిర్వహణపై సూచనలు చేశాక ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ప్రతిజ్ఞ చేయించారు. డీఎంహెచ్‌ఓ బి.కళావతి బాయి, అధికారులు పాల్గొన్నారు.

కమిషనర్ అంత మంచోడిని కాదు...

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌లో ప్రతీ ఉద్యోగి విధులను బాధ్యతగా నిర్వర్తించాలని కలెక్టర్ అనుదీప్ ఆదేశించారు. తాను కమిషనర్ అంత మంచి వాడిని కానందున... విధుల్లో అలసత్వం వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. ఇదేసమయాన ప్రజాప్రతినిధులు, కార్మిక సంఘాలతో పైరవీలు చేయించినా పరిగణనలోకి తీసుకోనని తెలిపారు. కేఎంసీ కార్యాలయంలో కమిషనర్ అభిషేక్ అగస్త్యతో కలిసి శుక్రవారం ఆయన పారిశుద్ధ్య నిర్వహణపై సమీక్షించారు. నగరంలో పారిశుద్ధ్యం మరింత మెరుగుపడాలని, ఇందుకోసం సోమవారం నుంచి పది రోజులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని సూచించారు. ఆ తర్వాత కూడా పరిస్థితిలో మార్పు రాకపోతే బాధ్యులపై చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. ఈ డ్రైవ్ సమయాన జవాన్లు, సిబ్బందికి సెలవులు రద్దు చేయడమే కాక వార్డు అధికారులు కూడా క్షేత్రస్థాయిలో పనిచేయాలని తెలిపారు. హోటళ్లు, వాణిజ్య సంస్థల బాధ్యులు చెత్త బయట వేస్తే లైసెన్సు రద్దు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అలాగే, పదిహేను రోజుల్లోగా ప్రధాన రహదారిపై గుంతలు లేకుండా మరమ్మతులు చేయాలని తెలిపారు. డిప్యూటీ కమిషనర్ కె.శ్రీనివాస్, అసిస్టెంట్ కమిషనర్ అనిల్‌కుమార్, కేఎంసీ ఈఈ ఏ.కృష్ణలాల్, శానిటరీ సూపర్‌వైజర్ ఎం.సాంబయ్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పంటల్లో తెగుళ్ల నివారణపై అవగాహన



మిర్చి మొక్కలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

ఎర్రుపాలెం: ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో పంటలను తెగుళ్లు ఆశిస్తున్నందున రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మధిర వ్యవసాయ పరిశోధన ప్రధాన శాస్త్రవేత్త రుక్మిణి సూచించారు. ఎర్రుపాలెం మండలంలోని బనిగండ్లపాడు, బుచ్చిరెడ్డిపాలెం, మీనవోలుల్లో శుక్రవారం ఆమె కీటక శాస్త్రవేత్త కె.నాగస్వాతితో కలిసి మిర్చి, పత్తి, వరి పంటలను పరిశీలించారు. వరిలో సుడిదోమ ఉధృతి ఉందని, మిర్చిలో ముడత వస్తోందని తెలిపారు. ఈమేరకు తెగుళ్ల నివారణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. ఏఓ బి.సాయిశివ, ఏఈఓలు సింధూర్, గోపి, వెంకటేష్ పాల్గొన్నారు.

నేడు 'ఐలు' ఆధ్వర్యాన సెమినార్

ఖమ్మం లీగల్: 'ఎన్‌రిచింగ్ ఆన్ ట్రాన్స్‌ఫర్ ఆఫ్ ప్రాపర్టీ యాక్ట్ మార్కింగ్ ఆఫ్ డాక్యుమెంట్స్'పై ఆల్ ఇండియ లాయర్స్ యూనియన్ (ఐలు) ఆధ్వర్యాన శనివారం ఖమ్మంలో సెమినార్ నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.నవీన్ చైతన్య, మందడపు శ్రీనివాసరావు తెలిపారు. ఈ సెమినార్‌లో హైకోర్టు మాజీ జడ్జి డాక్టర్ బి.శివ శంకర్‌రావు, తెలంగాణ బార్ కౌన్సిల్ అధ్యక్షుడు ఏ.నర్సింహారెడ్డి, అదనపు జిల్లా న్యాయమూర్తి వెంపటి అపర్ణ, బార్ కౌన్సిల్ సభ్యుడు కొల్లిసత్యనారాయణ పాల్గొంటారని వెల్లడించారు. ఖమ్మంలోని జీఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో ఉదయం పదిన్నర మొదలయ్యే సెమినార్‌కు న్యాయవాదులు హాజరు కావాలని కోరారు.

నేడు ఉమ్మడి జిల్లా ఖో-ఖో ఎంపిక పోటీలు

కల్లూరు: అండర్-19 బాలబాలికల కబడ్డీ జట్ల ఎంపికకు శనివారం కల్లూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో పోటీలు నిర్వహించనున్నారు. అలాగే, చదరంగం జట్ల ఎంపిక పోటీలు ఆదివారం జరుగుతాయని జిల్లా పాఠశాల క్రీడల సంఘం కార్యదర్శి ఎండీ.మూసా ఖలీం తెలిపారు. ఆరో తరగతి నుంచి ఇంటర్ ద్వితీయ సంవత్సరం వరకు చదువుతున్న బాలబాలికలు అర్హులని, ఆసక్తి ఉన్న వారు విద్యార్హతల సర్టిఫికెట్లు, మెమో, బోనఫైడ్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని సూచించారు.

గ్రీస్ దేశంలో ఉద్యోగావకాశాలు

ఖమ్మం రాపర్తినగర్: తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ లిమిటెడ్(టామ్‌కామ్) ఆధ్వర్యాన గ్రీస్ దేశంలో నిరుద్యోగ యువత ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారి కొండపల్లి శ్రీరాం తెలిపా రు. హౌజ్ కీపింగ్, కుక్స్, హోటల్ రిసెప్షనిస్ట్, ఎలక్ట్రీషియన్, ప్లంబర్ తదితర ఉద్యోగాలకు ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆసక్తి, అర్హతలు ఉన్న వారు దరఖాస్తులను tomcom. comresum @ gmail. com, కు పంపించడంతో పాటు వివరాలకు 94400 52081, 94400 51452 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

'తొందరపాటుతోనే కాంగ్రెస్‌కు ఎదురుదెబ్బ'

ఖమ్మం మామిళ్లగూడెం: రాష్ట్రప్రభుత్వం తీసుకున్న తప్పుడు నిర్ణయాలతో బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు స్టే విధించిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరు కోటేశ్వరరావు పేర్కొన్నారు. ఖమ్మంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ రాజకీయ లాభం కోసం చట్టాన్ని తాకట్టు పెట్టిన రాష్ట్రప్రభుత్వం ఇప్పుడు న్యాయస్థానం చేతిలో చెంపదెబ్బ తిందని పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ వర్గాల మద్దతు సంపాదించాలనే ఉద్దేశంతో తొందరపాటుగా రిజర్వేషన్లు ప్రకటించిందని తెలిపారు. ఈ సమయాన ప్రమాణాలను విస్మరించడంతో కోర్టులో ఎదురుదెబ్బ తాకిందని చెప్పారు. కాగా, జిల్లా నుంచి ముగ్గురు మంత్రులు ఉన్నా ప్రధానమైన సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదని కోటేశ్వరరావు విమర్శించారు. ఈసమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గుత్తా వెంకటేశ్వరావు, నాయకులు వీరవెల్లి రాజేష్‌గుప్త, శ్రీకృష్ణ, డాక్టర్ నెల్లూరి బెనర్జీ, సురేష్, రుద్రగాని మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
పెసలు	6,500	3,000
ఏసీ మిర్చి	15,400	8,000
మిర్చి	8,200	6,300
కొత్త పత్తి	7,100	4,500

– ఖమ్మం వ్యవసాయం

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.19,400

బీఏఎస్ బకాయిల భారం

- పాఠశాలలకు రావొద్దని యాజమాన్యాల అల్టిమేటం?
- ఆందోళనలో విద్యార్థులు, తల్లిదండ్రులు
- జిల్లాలో బకాయిలు రూ.9.41 కోట్లకు పైగానే..



సత్తుపల్లి ఎంఈఓకు వినతిపత్రం ఇస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

ఖమ్మంమయూరిసెంటర్: దళిత విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం బీఏఎస్(బెస్ట్ అవైలబుల్ స్కీం)ను అమలుచేస్తుంది. ఈ పథకం ద్వారా మెరుగైన బోధన, వసతి సౌకర్యాలు ప్రైవేట్ పాఠశాలలను ఎంపిక చేసి ఎస్సీ విద్యార్థులకు ప్రవేశాలు కల్పిస్తున్నారు. వీరి ఫీజు, ఇతరత్రా ఖర్చులను ప్రభుత్వం పాఠశాలల యజమాన్యాలకు చెల్లిస్తోంది. కానీ కొన్నాళ్లుగా ప్రభుత్వం నిధులు మంజూరు చేయడకపోవడంతో బకాయిలు పేరుకుపోయి నిర్వహణ భారంగా మారిందని యాజమాన్యాలు వాపోతున్నాయి. ఈ విద్యాసంవత్సరం ఆరంభంలోనే విద్యార్థులకు ప్రవేశాలు కల్పించబోమని చెప్పగా.. ప్రభుత్వ పెద్దల చర్చించి నచ్చచెప్పడంతో చివరకు పథకాన్ని కొనసాగించారు.

విద్యార్థుల అడ్డగింత

దళిత విద్యార్థులకు ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్య అందించాలనే ప్రభుత్వ లక్ష్యం బకాయిలు కారణంగా నీరుగారిపోతోంది. ప్రభుత్వం నుంచి రూ.9.41 కోట్ల బకాయిలు నిలిచిపోవడంతో బీఏఎస్(బెస్ట్ అవైలబుల్ స్కీం) అమలవుతున్న పాఠశాలల యాజమాన్యాలు కఠిన నిర్ణయాలు తీసుకుంటున్నాయి. కొన్ని పాఠశాలల్లో విద్యార్థులను తరగతులకు రావొద్దని చెబుతున్నట్లు సమాచారం. దీంతో మెరుగైన విద్య దూరమవుతుందేమోనని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

బకాయిల భారం

జిల్లా పరిధిలోనే ఏడు పాఠశాలలు బీఏఎస్ పథకంలో నమోదు చేసుకోగా.. విద్యార్థులకు ఫీజులకు సంబంధించి రూ.9.41 కోట్ల బకాయిలు ఉన్నట్లు యాజమాన్యాలు చెబుతున్నాయి. ఫలితంగా విద్యార్థులకు భోజనం, వసతి, విద్యుత్ బిల్లులు, ఉపాధ్యాయుల జీతాలు చెల్లింపులో ఇబ్బంది పడుతున్నామని వాపోతున్నారు. ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోతే పాఠశాలను నడపడం కష్టమని.. బకాయిలు చెల్లించాకే విద్యార్థులను అనుమతిస్తామని యాజమాన్య ప్రతినిధులు అధికారుల వద్ద స్పష్టం చేసినట్లు సమాచారం. అయితే, అధికారుల సూచనతో విద్యార్థులను అనుమతించినా... బుక్స్, ఇతర సామగ్రిని మాత్రం అందించడం లేదని తెలుస్తోంది.

బీఏఎస్ విద్యార్థుల ఇక్కట్లు

సత్తుపల్లిరూరల్: బెస్ట్ అవైలబుల్ పథకం నిధులు రాకపోవడంతో పాఠశాల నిర్వహణ భారంగా మారిందని పాఠశాలల యాజమాన్య బాధ్యులు వాపోతున్నారు. యారు. ఈమేరకు ఓ పాఠశాల బాధ్యులు చేసేదేం లేక తల్లిదండ్రులైనా ఫీజు చెల్లించాలని ఇటీవల సమాచారం ఇచ్చారు. ఏళ్లుగా ప్రభుత్వం నుంచి బకాయిలు రాకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. ఈమేరకు తల్లిదండ్రులు శుక్రవారం ఎంఈఓ నక్కా రాజేశ్వరరావుకు వినతిపత్రం అందించగా, సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు.

జిల్లాలో పాఠశాలల వారీగా బకాయిలు

పాఠశాల	విద్యార్థులు	పెండింగ్ బకాయి
బేబీమూన్ హైస్కూల్, ఖమ్మం	584	రూ.3,03,80,000
సెంచరీ హై ప్రొఫైల్ స్కూల్, ఖమ్మం	284	రూ.1,92,34,400
హార్వెస్ట్ హైస్కూల్, ఖమ్మం	42	రూ.17,82,200
వి.వి.విద్యాలయం, సత్తుపల్లి	63	రూ.67,32,800
సెయింట్ అలోషియస్, తనికెళ్ల	115	రూ.84,23,640
సెయింట్ ఆన్స్, బనిగండ్లపాడు	87	రూ.1,21,57,200
సెయింట్ జోసెఫ్స్, ఖమ్మం	132	రూ.1,54,77,600
మొత్తం	1,307	రూ.9,41,87,840

ఉదాసీనత విడనాడాలి..



గతంలో పాఠశాలలో చేరిన వెంటనే బుక్స్, యూనిఫామ్ ఇచ్చేవారు. కానీ ప్రస్తుతం పిల్లలను పాఠశాలలకే రావొద్దని చెబుతున్నారు. బకాయిల విషయంలో ప్రభుత్వ ఉదాసీనత పిల్లల భవిష్యత్‌కు ఇబ్బందిగా మారుతోంది. ఇకనైనా సమస్యను పరిష్కరించాలి. – ఎం.లక్ష్మణ్, విద్యార్థి తండ్రి, ఖమ్మం

తక్షణమే స్పందించాలి..



ప్రభుత్వ నిర్లక్ష్యంతో దళిత విద్యార్థులకు చదువుకు దూరమయ్యే ప్రమాదం ఉంది. బీఏఎస్ బకాయిలు చెల్లించకపోతే 1,300 మంది నష్టపోయే అవకాశముంది. ప్రభుత్వం బకాయిలు విడుదల చేయడమే కాక యాజమాన్యాల నుంచి బుక్స్, యూనిఫామ్స్ ఇప్పించాలి. – తుడుం ప్రవీణ్, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి

పది రోజుల్లో పత్తి కొనుగోళ్లు



జిన్నింగ్ మిల్లులో పత్తిని పరిశీలిస్తున్న వ్యాపారులు (ఫైల్)

- జిన్నింగ్ మిల్లుల యాజమాన్యాలతో సీసీఐ చర్చలు
- నిబంధనల సడలింపుతో టెండర్ల దాఖలు
- క్రాప్ బుకింగ్ ఆధారంగా స్లాట్ల కేటాయింపు

పత్తి సాగు విస్తీర్ణం, దిగుబడి అంచనా

జిల్లా	సాగు (ఎకరాల్లో)	దిగుబడి (క్వింటాళ్లలో)
ఖమ్మం	2,25,613	27,07,356
భద్రాద్రి	2,40,345	28,05,576

ఖమ్మంవ్యవసాయం: జిల్లాలో సీసీఐ ద్వారా పత్తి కొనుగోళ్లకు రంగం సిద్ధమైంది. ఇన్నాళ్లు సీసీఐ నిబంధనలు కఠినంగా ఉన్నాయని జిన్నింగ్ మిల్లుల యాజమాన్యాలు టెండర్లకు దూరంగా ఉన్నాయి. ఆగస్టు మొదటి వారంలోనే సీసీఐ జిన్నింగ్ మిల్లులను గుర్తించి, మూడుసార్లు గడువు పొడిగించినా టెండర్ల దాఖలకు ముందుకు రాలేదు. ప్రభుత్వ కొనుగోళ్లు లేకపోవడంతో తేమ, నాణ్యత సాకుతో వ్యాపారులు క్వింటాకు రూ.6 వేలు మించి చెల్లించడం లేదు. ఫలితంగా కేంద్రప్రభుత్వం పత్తికి తేమశాతం ఆధారంగా రూ.8,110గా నిర్ణయించిన గరిష్ఠ దక్కక రైతులు నష్టపోతున్నారు. ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకుని మరోమారు చర్చలు జరిపి నిబంధనల్లో కొన్ని మార్పులు చేయడంతో ఉమ్మడి జిల్లాలోని 15మిల్లుల యజమాన్యాలు టెండర్లు దాఖలు చేశా యి. ఈ టెండర్లను పరిశీలించి కలెక్టర్ల ఆమోదంతో వారంలోగా ఖరారు చేయనున్నారు. ఆపై పది రోజు ల్లోగా సీసీఐ ద్వారా పత్తి కొనుగోళ్లు మొదలుకానున్నాయి.

క్రాప్ బుకింగ్ ఆధారంగానే...


సీసీఐ పత్తి కొనుగోళ్లకు క్రాప్ బుకింగ్ ముడిపడి ఉండటంతో వ్యవసాయ శాఖ పంట నమోదును వేగవంతం చేసింది. కొనుగోళ్లలో పారదర్శకత కోసం స్లాట్ బుకింగ్ విధానాన్ని తీసుకొచ్చారు. దీనికోసం 'కపాస్ కిసాన్ యాప్'ను ప్రవేశపెట్టగా వ్యవసాయ అధికారులు పంట నమోదు పూర్తి చేసి వివరాలను మార్కెటింగ్ శాఖకు సమర్పించాల్సి ఉంటుంది. ఈ వారంలో ఇది కూడా పూర్తయితే యాప్‌లోనే రైతులు స్లాట్ బుక్ చేసుకొని నేరుగా కేటాయించిన జిన్నింగ్ మిల్లులో పత్తి విక్రయించుకునే అవకాశం ఏర్పడుతుంది. ఇదంతా త్వరలోనే పూర్తిచేసి ఈనెల 22, 23వ తేదీ నుంచి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించడానికి సమాయత్తమవుతున్నారు.

సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఇవే...

ఖమ్మం వ్యవసాయ మార్కెట్ పరిధి ఖమ్మం రూరల్ మండలం వెంకటగిరిలోని జీఆర్ఆర్ ఇండస్ట్రీస్, తల్లంపాడులోని శ్రీ సాయి బాలాజీ జిన్నింగ్ అండ్ ఆయిల్ మిల్లులో సీసీఐ పత్తి కొనుగోలు చేయనుంది. అలాగే, మధిర మార్కెట్ పరిధి దెందుకూరులోని అమరావతి టెక్స్‌టైల్స్, మాటూరులోని మంజీత్ కాటన్ మిల్, ఇల్లెందులపాడులోని శ్రీ శివ గణేష్ కాటన్ ఇండస్ట్రీస్, నేలకొండపల్లి మార్కెట్ పరిధి ముదిగొండ మండలం సువర్ణాపురంలోని ఉషశ్రీ కాటన్ అండ్ జిన్నింగ్ మిల్, వైరా మార్కెట్ పరిధి తల్లాడలోని స్టాప్లరిచ్ జిన్నింగ్ ఇండస్ట్రీస్, మద్దులపల్లి మార్కెట్ పరిధి ఖమ్మం రూరల్ మండలం పొన్నెకల్‌లోని జీఆర్ఆర్ జిన్నింగ్ మిల్, తిరుమలాయపాలెం మండలం గోల్‌తండాలోని శ్రీ భాగ్యలక్ష్మి కాటన్ ఇండస్ట్రీస్‌తో పత్తి కొనుగోలు చేస్తారు. ఇక భద్రాద్రి జిల్లాకు సంబంధించి ఇల్లెందు మార్కెట్ పరిధి కారేపల్లిలోని లక్ష్మీప్రియ జిన్నింగ్ మిల్, శ్రీలక్ష్మీప్రియ కాటెక్స్ జిన్నింగ్ మిల్, కొత్తగూడెం మార్కెట్ పరిధిలోకి వచ్చే కొత్తగూడెంలోని మంజిత్ జిన్నింగ్ మిల్, బూర్గంపాడు మార్కెట్ పరిధి బూర్గంపాడులోని అనూశ్రీ జిన్నింగ్ మిల్, శ్రీ లక్ష్మీనర్సింహ జిన్నింగ్ మిల్, శ్రీ రమేష్ ఇండస్ట్రీస్ జిన్నింగ్ మిల్, భద్రాచలం మార్కెట్ పరిధి అశ్వాపురంలోని శ్రీరామా జిన్నింగ్ మిల్లులో పత్తి కొనుగోళ్లకు ఏర్పాట్లు చేస్తున్నారు.

తేమ శాతం ఆధారంగా పత్తి ధర (రూ.ల్లో)

తేమ	మద్దతు ధర
8	8,110
9	8,029
10	7,948
11	7,867
12	7,786



క్రీడలతో ఉజ్వల భవిష్యత్



మాట్లాడుతున్న ఎంపీ రఘురాంరెడ్డి, పక్కన అధికారులు, నిర్వాహకులు

- ఖమ్మం ఎంపీ రఘురాంరెడ్డి
- రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ టోర్నీ ప్రారంభం

ఖమ్మం స్పోర్ట్స్: ప్రపంచంలో కొన్ని చిన్నదేశాల పేర్లను సైతం గుర్తుపెట్టుకోవడానికి అక్కడి ప్రజలు క్రీడల్లో రాణించడమే కారణమని ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి తెలిపారు. క్రీడలతో ఉజ్వల భవిష్యత్ సొంతమవుతుందనే విషయాన్ని గుర్తించి విద్యార్థులను తీర్చిదిద్దేలా రాష్ట్రప్రభుత్వం నూతన క్రీడా పాలసీని ప్రవేశపెట్టిందని చెప్పారు. ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో బాలసాని సన్యాసయ్య స్మారక రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ ర్యాంకింగ్ పోటీలను శుక్రవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. పిల్లలను చదువుకే పరిమితం చేయకుండా క్రీడల్లోనూ తల్లిదండ్రులు ప్రోత్సహించాలని సూచించారు. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి సహకారం ఉంటుందని చెప్పారు. విద్యార్థులు కూడా గెలుపోటములను సమానంగా తీసుకుంటే ఉన్నత స్థాయికి చేరొచ్చని తెలిపారు. అనంతరం రఘురాంరెడ్డి కొద్దిసేపు టేబుల్ టెన్నిస్ ఆడి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. డీపైఎస్ఓ సునీల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పుట్టా శంకరయ్య, కె.క్రిస్టోఫర్‌బాబు, టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బాలసాని విజయ్‌కుమార్, వీఎస్ఎస్.మూర్తితో పాటు ఎస్.ఉప్పల్‌రెడ్డి, పి.రవిమారుత్, కొప్పుల చంద్రశేఖర్, కార్పొరేటర్ మిక్కిలినేని మంజుల నరేంద్ర పాల్గొన్నారు.

మనోళ్ల ముందంజ



జ్వాలిత్



హితేష్

రాష్ట్రస్థాయి ర్యాంకింగ్ టేబుల్ టెన్నిస్ పోటీలు తొలి రోజు హోరాహోరీగా కొనసాగాయి. అండర్-11 కేటగిరీ నుంచి సీనియర్స్ వరకు క్రీడాకారులు నువ్వా, నేనా అన్నట్లు తలపడ్డారు. కాగా, అండర్-17 బాలుర సింగిల్స్‌లో పూల్ విన్నర్‌గా జిల్లాకు చెందిన పి.జ్వాలిత్, అండర్-13 సింగిల్స్‌లో కోగిరి హితేష్ ముందంజలో నిలిచి నాకౌట్ దశకు చేరడం విశేషం. అలాగే, బాలికల విభాగంలో జి.సిరి తొలి మ్యాచ్‌లో విజయం సాధించింది.

అటవీ ఉద్యోగుల క్రీడలు షురూ..



పోటీలను ప్రారంభిస్తున్న సీసీఎఫ్ భీమానాయక్

చుంచుపల్లి: రెండు రోజుల పాటు నిర్వహించనున్న అటవీ శాఖ ఉద్యోగుల జోనల్ స్థాయి క్రీడా పోటీలను కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో సీసీఎఫ్ భీమానాయక్ శుక్రవారం ప్రారంభించారు. భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ జిల్లాల ఉద్యోగులకు 800 మంది అథ్లెటిక్స్, వాలీబాల్, క్రికెట్, కబడ్డీ, షటిల్, రన్నింగ్ తదితర పోటీలు నిర్వహిస్తున్నారు. తొలిరోజు కబడ్డీ, షటిల్, రన్నింగ్, వాలీబాల్, క్రికెట్ పోటీల్లో ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీల ప్రారంభం సందర్భంగా భీమానాయక్ మాట్లాడుతూ విధి నిర్వహణలో ఒత్తిడితో ఉండే ఉద్యోగులకు క్రీడల ద్వారా మానసిక ప్రశాంతత చేకూరుతుందని అన్నారు. అటవీ, పర్యావరణ పరిరక్షణలో ఉద్యోగుల పాత్ర మరువలేనిదని చెప్పారు. ఇదే సమయాన క్రీడలపై ఆసక్తి చూపాలని సూచించారు. రెండు రోజుల పాటు నిర్వహించే పోటీల్లో చురుగ్గా పాల్గొని ప్రతిభ చాటాలని ఆకాంక్షించారు. క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశామన్నారు. వివిధ జిల్లాల డీఎఫ్ఓలు, ఎఫ్‌డీఓలు, డీఆర్ఓలు, రేంజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

హైవే సర్వే అడ్డగింత

రఘునాథపాలెం: మండలంలోని వి.వెంకటాయపాలెం పరిధిలో నేషనల్ హైవే నిర్మాణానికి సర్వే కోసం అధికారులు శుక్రవారం వచ్చారు. స్థానిక రెవెన్యూ అధికారుల సహకారంతో మొక్కలు, బావులు తదితర ఆస్తుల వివరాల నమోదుకు రావడంతో స్థానిక రైతులు అడ్డుకున్నారు. ఈ విషయమై ప్రస్తుతం హైకోర్టు స్టే ఉన్నందున సర్వే చేయొద్దని తెలిపారు. ఈమేరకు రైతుల ఆందోళనతో అధికారులు వెనుదిరిగారు.

యూరియా అమ్మకాలపై డీఏఓ ఆరా

మధిర: మధిర మండలం మాటూరు రైతు వేదికలో యూరియా అమ్మకాలను జిల్లా వ్యవసాయ అధికారి డి.పుల్లయ్య శుక్రవారం పరిశీలి ంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఇబ్బంది లేకుండా క్లస్టర్ స్థాయిలోనే యూరియా అమ్మకాలు చేపడుతున్నట్లు తెలిపారు. మధిర సొసైటీ కింద ఎక్కువ గ్రామాలు ఉన్నందున సబ్ సెంటర్ ఏర్పాటుచేశామని తెలిపారు. కాగా, రైతులు నానో యూ రియా, నానో డీఏపీపైనా దృష్టి సారించాలని డీఏఓ సూచించారు. మండల వ్యవసాయ అధికారి సాయిదీక్షిత్, ఏఈఓలు పాల్గొన్నారు.

రిజర్వేషన్లకు చట్టబద్ధతలో ప్రభుత్వ వైఫల్యం

ఖమ్మంవైరారోడ్: బీసీ రిజర్వేషన్లకు చట్ట బద్ధత సాధించడంలో రాష్ట్రప్రభుత్వం విఫలమైందని మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బీసీల హక్కులు, అవకాశాలను రక్షించాల్సి ఉండగా, ఎంపీలు రిజర్వేషన్లపై ఏనాడూ పార్లమెంట్‌లో మాట్లాడలేదని తెలిపారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీల ద్వంద వైఖరితో ఈ పరిస్థితి ఏర్పడినందున పార్లమెంట్‌లో చట్టం ద్వారా రిజర్వేషన్ల పెంపునకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని ఆయన సూచించారు.

రవాణా శాఖలో దందాపై విజిలెన్స్ ఆరా

ఖమ్మంక్రైం: జిల్లా కేంద్రంలోని రవాణా శాఖ కార్యాలయంలో ఏజెంట్ల దందా, కొందరు ఉద్యోగుల తీరుపై విమర్శలు వస్తున్న నేపథ్యాన ఇంటెలిజెన్స్ శాఖ ఆరా తీసినట్లు తెలిసింది. ఈ విషయమై 'సాక్షి'లో శుక్రవారం 'ఏజెంట్లు చెప్పిందే వేదం!' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో ఇంటలిజెన్స్ అధికారులు వివరాలు సేకరించి ప్రభుత్వానికి నివేదిక ఇచ్చినట్లు సమాచారం. కీలకమైన జిల్లా రవాణా శాఖాధికారి పోస్టు ఖాళీగా ఉండడంతో కొందరు ఉద్యోగులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుండడంతో పాటు ఏజెంట్ల ద్వారా వచ్చిన పనులే చేస్తున్నట్లు తెలిసింది. ఈ విషయమై పూర్తి వివరాలతో 'సాక్షి'లో ప్రచురితమైన కథనంతో అధికారులు ఉలికిపడ్డారు. ఇకపై ఎవరు కూడా మీడియాకు సమాచారం ఇవొవ్వద్దని సూచించిన కొందరు అధికారులు.. కార్యాలయానికి వచ్చే మీడియా సిబ్బందితో చనువుగా ఉండొద్దని ఆదేశించినట్లు సమాచారం. అయితే, శుక్రవారం మధ్యాహ్నం వరకు కార్యాలయంలోనికి ఏజెంట్లను అనుమతించకపోగా, మధ్యాహ్నం తర్వాత మళ్లీ యథావిధిగా రాకపోకలు కొనసాగాయి. శని, ఆదివారం వరుస సెలవులు ఉండడంతో తమకు లాభం వచ్చే ఫైళ్లను తెప్పించుకున్న కొందరు అధికారులు సంతకాలు చేసినట్లు తెలిసింది.

సాక్షి ఎఫెక్ట్..

పొలాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు చోరీ



ట్రాన్స్‌ఫార్మర్ చోరీ కావడంతో ఖాళీగా ఉన్న దిమ్మె

సత్తుపల్లిటౌన్: పంట సాగు కోసం రైతులు ఏర్పాటు చేసుకున్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేస్తున్నారు. సత్తుపల్లి రామానగరం రోడ్డులో బొంతు నాగేశ్వరరావు పొలం వద్ద ఉన్న 22కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్ గురువారం రాత్రి చోరీకి గురైంది. అలాగే, 3వ తేదీన రుద్రాక్షపల్లి రోడ్డులో చీకటి శ్రీనివాసరావు పొలంలో, పాటిబండ్ల ఉమామహేశ్వరరావు పొలంలోనూ ట్రాన్స్‌ఫార్మర్లను అపహరించారు. అంతేకాక గత నెల 9న రుద్రాక్షపల్లిలోని దాసరి ప్రతాప్‌రెడ్డి, 13వ తేదీన రామానగరంలో గుర్రాల కృష్ణారావు పొలంలోనూ ట్రాన్స్‌ఫార్మర్లను ఎత్తుకెళ్లారు. అర్ధరాత్రి వేళ్ల తీగలను కత్తిరించి ట్రాన్స్‌ఫార్మర్లలోని రూ.లక్షల విలువైన కాపర్‌వైర్ కోసం ఎత్తుకెళ్తున్నట్లు తెలుస్తోంది. పంట చేతికొచ్చే సమయాన ఈ ఘటనలు జరుగుతుండడంతో చేన్లకు నీరు పెట్టలేకపోతున్నామని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇలాంటి ఘటనలు జరగకుండా పోలీసులు నిఘా పెంచాలని రైతులు కోరుతుండగా, ఇప్పటికే ఫిర్యాదు చేశామని విద్యుత్‌శాఖ ఏఈ కావ్య తెలిపారు.

చెల్లని చెక్కు కేసులో ఏడాది జైలుశిక్ష

ఖమ్మం లీగల్: అప్పు చెల్లించే క్రమాన ఇచ్చిన చెక్కు చెల్లకపోవడంతో ఖమ్మం ఓల్డ్ క్లబ్ రోడ్డుకు చెందిన బెజ్జం విజయ్‌కుమార్‌కు ఏడాది జైలుశిక్ష విధిస్తూ ఒకటో అదనపు ప్రథమశ్రేణి కోర్టు న్యాయాధికారి బి.రజని శుక్రవారం తీర్పు చెప్పారు. ఖమ్మం నెహ్రూనగర్‌కు చెందిన కంచర్ల రాజేంద్రప్రసాద్ వద్ద 2013 ఏప్రిల్‌లో విజయ్‌కుమార్ రూ.20 లక్షల అప్పు తీసుకున్నాడు. అదే ఏడాది అక్టోబర్ 7న రూ.18 లక్షలకు చెక్కు జారీచేసినా ఆయన ఖాతాలో సరిపడా నగదు లేక తిరస్కరణకు గురైంది. దీంతో న్యాయవాది ద్వారా లీగల్ నోటీస్ జారీచేసి కోర్టులో ప్రైవేటు కేసు దాఖలు చేశాడు. విచారణ అనంతరం విజయ్‌కుమార్‌కు జైలుశిక్ష విధించడమే కాక ఫిర్యాదికి రూ.18లక్షలు చెల్లించాలని తీర్పు చెప్పారు.

ప్రార్థనా మందిరం కూల్చివేత

బోనకల్: మండలంలోని గోవిందాపురం(ఎల్)లో ఇంటిగ్రేటెడ్ పాఠశాల సమీపాన ఓ మతానికి చెందిన ప్రార్థనా మందిరాన్ని గురువారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు జేసీబీ సాయంతో కూల్చివేశారు. అంతేకాక ప్రార్థన సామగ్రిని గ్రామ శిరు బోనకల్ బ్రాంచ్ కెనాల్‌లో పడేశారు. గ్రామానికి చెందిన కొత్తపల్లి రాంబాబు ఇక్కడ ప్రార్థనా మందిరాన్ని నిర్మించాడు. చేస్తున్నాడు. గ్రామంలో 401 సర్వేనంబర్‌లోని ప్రభుత్వ భూమిని కొందరు ఆక్రమించి సేద్యం చేస్తుండగా.. అక్కడే కొంత స్థలంలో రాంబాబు ప్రార్థనా మందిరాన్ని నిర్మించాడు. ఈక్రమంలో గుర్తుతెలియని వ్యక్తులు జేసీబీ సాయంతో కూల్చివేశారు. ఈ విషయం తెలియగా శుక్రవారం ఉదయం తహసీల్దార్ రమాదేవి పరిశీలించి ప్రార్థనా సామగ్రిని బయటకు తీయించి తహసీల్‌లో భద్రపరిచారు. ఘటనపై రాంబాబు ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పొదిలి వెంకన్న తెలిపారు.

కాగా, గోవిందాపురం(ఎల్) గ్రామంలో కొన్నేళ్లగా వరుస వివాదాలతో ఉద్రిక్తత చోటు చేసుకుంటోంది. ఓ మతానికి చెందిన మందిర నిర్మాణ విషయంలో రాజకీయ పార్టీల మధ్య ఘర్షణలు జరిగాయి. ఊరేగింపు సందర్భంగా అల్లరు చెలరేగి ఓ వ్యక్తి హత్యకు గురయ్యాడు. ఇప్పుడు ప్రార్థనా మందిరాన్ని కూల్చివేయడంతో మరోమారు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

ఇద్దరిని బలిగొన్న రోడ్డు ప్రమాదం

- బైక్‌ను ట్రాక్టర్ ఢీకొట్టడంతో ఘటన
- బాలుడు, బాలిక మృతి
- మరొకరికి గాయాలు



ప్రవీణ్‌మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు

ముదిగొండ : మండలంలోని పెద్దమండవ – బాణాపురం రహదారిలో బైక్‌ను ట్రాక్టర్ ఢీ కొట్టిన ప్రమాదంలో ఓ బాలుడు, బాలిక మృతిచెందగా మరొకరు తీవ్రంగా గాయపడిన ఘటన శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. పెద్దమండవ గ్రామానికి చెందిన పేరం ప్రవీణ్(13), గొర్రెముచ్చు సనా(10), గొర్రెముచ్చు సాయి బైక్‌పై ఖమ్మం వెళ్తుండగా ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో పేరం ప్రవీణ్ అక్కడికక్కడే మృతిచెందాడు. తీవ్రంగా గాయపడిన సనా, సాయిని ఖమ్మం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సనా ప్రాణాలు కోల్పోయింది. కాగా, ఆ రహదారిలో మామిడి మొద్దులు ఉండగా వాటికి బైక్‌ను ఢీ కొట్టడం వల్లే ప్రమాదం జరిగిందని కొందరు చెబుతుండగా, ప్రవీణ్ కుటుంబసభ్యులు మాత్రం ట్రాక్టర్ ఢీ కొట్టడం వల్లే ఈ ఘటన చోటుచేసుకుందని అంటున్నారు. దీనిపై సీఐ మురళిని వివరణ కోరగా సెల్ఫ్‌యాక్సిడెంట్ జరిగి ఉండొచ్చని చెప్పారు.

అనుమానాస్పద స్థితిలో రైల్వే ఉద్యోగి మృతి



ఖాదర్‌బాబు (ఫైల్)

బోనకల్: మండల కేంద్రంలోని రైల్వే క్వార్టర్స్‌లో నివాసముండే గ్యాంగ్‌మెన్ ఎస్‌కే.ఖాదర్‌బాబు(35) అనుమాన్పాద స్థితిలో మృతిచెందాడు. ఆయన భార్యతో విబేధాలతో పదమూడేళ్ల నుంచి విడివిడిగా నివసిస్తున్నారు. ఈ క్రమాన మద్యానికి బానిసైన ఖాదర్ క్వార్టర్స్‌లో ఒక్కడే నివసిస్తున్నాడు. దసరా రోజు నుంచి మద్యం ఎక్కువగా తాగినట్లు తెలిసింది. ఆపై మత్తులో బాత్‌రూమ్‌కు వెళ్లే సమయాన కింద పడడంతో తలకు గాయమై మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. అయితే, క్వార్టర్స్ నుంచి శుక్రవారం ఉద యం నుంచి దుర్వాసన వస్తుండడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా పరిశీలించారు. మృతదేహానికి పురుగులు పట్టి ఉండడంతో మూడు రోజుల క్రితమే మృతి చెందినట్లు భావిస్తున్నారు. ఖాదర్ తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై పి.వెంకన్న తెలిపారు.

రైలుకింద పడి వ్యక్తి ఆత్మహత్య

ఖమ్మంక్రైం: ఖమ్మం–పందిళ్లపల్లి రైల్వేస్టేషన్ మధ్య సూర్యాపేటకు చెందిన మనన ప్రతాప్‌సింగ్(56) అనారోగ్య కారణాలతో గురువారం రాత్రి రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. విజయవాడ మార్గంలో వెళ్తున్న నవజీవన్ ఎక్స్‌ప్రెస్ కింద పడి ఆయన బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఆయన వద్ద లభించిన సిమ్ కార్డ్ ఆధారంగా కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చామని జీఆర్పీ హెడ్‌కానిస్టేబల్ కె.శ్రీనివాసరావు తెలిపారు. అనంతరం మృతదేహాన్ని అన్నం సేవా ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు సాయంతో ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించినట్లు వెల్లడించారు.

ఇంటర్ విద్యార్థి ఆత్మహత్యాయత్నం

బోనకల్: మండలంలోని గోవిందాపురం(ఎల్) గ్రామానికి చెందిన ఇంటర్ విద్యార్థి కుంచపు సందీప్ శుక్రవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఖమ్మంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో చదువుతున్న ఆయన దసరా సెలవులకు ఇంటికి వచ్చాడు. తిరిగి కళాశాలకు వెళ్లలేక శుక్రవారం చింతకాని మండలం ప్రొద్దుటూరులోని ఫెర్టిలైజర్ షాపునకు వెళ్లి గడ్డి మందు కొనుగోలు చేసి మధ్యలోనే తాగి ఇంటికి వచ్చినట్లు తెలిసింది. వాంతులు చేసుకుంటుండడంతో తల్లిదండ్రులు ఆరా తీయగా పురుగుల మందు తాగినట్లు చెప్పడంతో సందీప్‌ను ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.